పనిభారం తగ్గించాలి


వినతి పత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నంద్యాల(అర్బన్): అధిక పని భారం, పని ఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని నంద్యాల మండల పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు పని భారం తగ్గేలా ప్రభుత్వానికి విన్నవించాలని కోరుతూ గురువారం మండల గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ సుగుణశ్రీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ వివిధ రకాల సర్వేలు, ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాల అమలు, పన్నుల వసూళ్లు, తదితరాలతో పని ఒత్తిడి నెలకొందన్నారు. పంచాయతీ పనుల్లో ఇబ్బందులు పడుతున్న తమకు సర్వేల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఆరోగ్య పరంగా ఎంతో నష్టపోతున్నా పని భారం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఈఓఆర్డీ జ్యోతి, పీఎస్‌లు ప్రసన్నలక్ష్మి, స్వర్ణశ్రీ పాల్గొన్నారు.

గోస్పాడు: పని ఒత్తిడిని తగ్గించాలని మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు కోరారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అమానుల్లాకు వినతిపత్రం అందజేసి వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్వహించిన సర్వేల కన్నా ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో నిత్యం ఏదో ఒక సర్వే పేరుతో సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడమే కాక మానసిక వేదినకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈవోపీఆర్డీ నాగ అనసూయ, పంచాయితీ కార్యదర్శులు ప్రసాదు, సుబ్బారావు, వెంకటేష్, సతీష్‌రెడ్డి, భాస్కరరావు, సర్వేష్, సుజాత, స్వర్ణ, నాగలక్ష్మి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ నిర్వహణకు ప్రత్యేక అధికారులు

నంద్యాల(అర్బన్): మండలంలోని గ్రామాల్లో ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని గ్రామ సచివాలయ సిబ్బంది, ఎస్‌హెచ్ గ్రూప్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ నాయకులు నిర్వహించాలని ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు చెప్పారు. అయ్యలూరు–1, 2కు తహసీల్దార్ ప్రియదర్శిని, భీమవరానికి ఏపీఓ శ్రీకళ, బిల్లలాపురానికి సూపర్‌వైజర్ నజీర, చాబోలుకు ఎంపీడీఓ సుగుణశ్రీ ,చాపిరేవులకు ఆర్‌డబ్ల్యూఎస్ మురళీకృష్ణనాయక్, కానాల–1, 2కు ఈఓఆర్డీ శివనాగజ్యోతి, కొత్తపల్లె ఏపీఎం గుర్రప్ప, మిట్నాలకు హెచ్ఓ శ్రీధర్, మునగాలకు సూపర్‌వైజర్ ఆరోగ్యమ్మ, పెద్దకొట్టాల పశువైద్యులు శ్రీనివాసరెడ్డి, పాండురంగాపురం పశువైద్యురాలు మల్లేశ్వరి, పోలూరుకు తహసీల్దార్ శ్రీనివాసులు, పులిమద్దికి ఎంఈఓ–2 శివరాంప్రసాద్, పుసులూరుకు ఏఓ ప్రసాదరావు, రాయమాల్పురం గ్రామానికి పీఆర్ ఏఈ శివశంకర్‌ను నియమించామని చెప్పారు.

లైంగిక వేధింపులు క్షమించరాని నేరం

ఆళ్లగడ్డ: చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడడం క్షమించరాని నేరమని 5వ అదనపు జిల్లా జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీక్రిష్ణ, డీఎస్పీ ప్రమోద్ అన్నారు. పట్టణంలోని వైపీపీఎం ఉన్నత పాఠశాలలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చదువుతో పాటు చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు.

బండలాగుడు విజేత రాయవరం వృషభాలు

చాగలమర్రి: మండలంలోని పెద్దవంగలి గ్రామంలో హజ్రత్ దస్తగిరిస్వామి ఉరుసును పురస్కరించుకుని గురువారం నిర్వహించిన ఎద్దుల బండలాగుడు పోటీల్లో నాగర్ కర్నూల్ జిల్లా రాయవరం గ్రామానికి చెందిన అక్షరరెడ్డి, ధనుష్‌రెడ్డిలకు చెందిన వృషభాలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. పోటీల్లో 11 జతల వృషభాలు పాల్గొన్నాయి. వైఎస్సార్ జిల్లా గుండ్లకుంట గ్రామానికి చెందిన వర్షనిరెడ్డి వృషభాలు తృతీయ స్థానం, ఆ తర్వాతి స్థానాల్లో దొర్నిపాడు గ్రామానికి చెందిన మనోహర్, రుద్రవరం మండలం అప్పనపల్లె గ్రామానికి చెందిన దస్తగిరి, కోటకందుకూరు గ్రామానికి చెందిన గోసే నరసింహారెడ్డి వృషభాలు నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.40,116, రూ.30,116, రూ.20,116, రూ.15,016, రూ.10,016, రూ.3,016 అందజేశారు.

17 నుంచి ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

రుద్రవరం: ఏపీ మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడినట్లు ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి దరఖాస్తుల ప్రక్రియ మొదలవుతుందన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులకు కలిపి మొత్తం 160 సీట్లు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఓసీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీలు రూ.150 రుసుం చెల్లించి మే 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బిల్లలాపురం సమస్యలు పరిష్కరించండి

నంద్యాల(అర్బన్): మండలంలోని బిల్లలాపురం గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ కోరారు. ప్రజా చైతన్యయాత్రలో భాగంగా గురువారం జిల్లా కార్యవర్గ సభ్యులు రామచంద్రుడు, మండల కార్యదర్శి బాలవెంకట్‌తో కలిసి గ్రామంలో పర్యటించారు. బీసీ, ఎస్సీ కాలనీలోని డ్రైనేజీ సమస్య, సిమెంట్ రోడ్లున దళిత వాడలోని శ్మశాన వాటికలో పొదలు పిచ్చిమొక్కలు, తదితరాలను పరిశీలించారు.

పెండింగ్‌లో ఉన్న పెనాల్టీ కేసులను పరిష్కరించండి

- జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్


మాట్లాడుతున్న రామునాయక్

నంద్యాల: సమాచార హక్కు చట్టం –2005కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పెనాల్టీ కేసులను త్వరగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని పీజీఆర్‌ఎస్ హాలులో అన్ని శాఖల జిల్లా అధికారులకు సమాచార హక్కు చట్టం–2005 పై జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు. రామునాయక్ మాట్లాడుతూ ప్రతి కార్యాలయంలో 4(1)బి రిజిస్టర్‌తో పాటు రిజిస్టర్ 1 – 2 తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. సమాచార హక్కు చట్టం కిద వచ్చే దరఖాస్తులను 30 రోజులలోపు పరిష్కరించాలని, గడువు లోపు సమాచారం ఇస్తుంటే పే.ఈకి రూ.2/– చొప్పున వసూలు చేయాలని, ఒక వేళ గడువు దాటిన ఎడల దరఖాస్తుదారుడికి ఉచితంగా సమాచారం ఇవ్వాల్సి ఉంటుందన్న విషయాన్ని అధికారులు గుర్తు ఉంచుకోవాలని చెప్పారు. ఒకవేళ మీకు సంబంధం లేని విషయం అయితే సెక్షన్ 6(3) కింద సదరు అంశం మాకు సంబంధం లేదని 5 రోజుల్లోపు తిరిగి పంపాలన్నారు. అలాగే సెక్షన్ 2(సి) కింద ప్రజా ప్రయోజనాలకు సంబంధించి ఏవైనా దరఖాస్తులు అడిగినప్పుడు సమాచారం ఇవ్వాల్సిన అవసరం లేదని, తదితర సెక్షన్లపై డీఆర్ఓ అవగాహన కల్పించారు. ప్రతి కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డును తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అందులో పీఐఓ పేరు, ఫోన్ నంబరుతో పాటు అప్పిలేట్ అధికారి పేరు, ఫోన్ నంబరు అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని చెప్పారు. అనంతరం ఏ సమాచారాన్ని ఇవ్వవచ్చు, ఇవ్వకూడదనే అంశాలపై కలెక్టరేట్ సిబ్బంది అవగాహన కల్పించారు. కలెక్టరేట్ ఏఓ రవి కుమార్, సి–సెక్షన్ సూపరింటెండెంట్ శుభకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

సత్ప్రవర్తన అలవర్చుకోవాలి

ఆళ్లగడ్డ: క్షణికావేశంలో నేరాలకు పాల్పడుతుంటారని.. ప్రస్తుతం జైలులో రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్న వారు సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీలా వెంకట శేషాద్రి అన్నారు. స్థానిక ఉప కారాగారంలోని న్యాయ సహాయ కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఖైదీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక స్థోమత లేని వారికి ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేస్తామన్నారు.

అండర్‌పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని నూనెపల్లెలో రైల్వే అండర్‌పాస్‌బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని, కాలువలను శుభ్రం చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్,తోటమద్దులు,రామరాజు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఏకలవ్య నగర్,హరిజనపేట,కొలిమిపేట,వివర్తినగర్,కాలనిలో సీపీఎం ప్రజా చైతన్యయాత్రను నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగితెలుసుకున్నారు.

ఘనంగా దస్తగిరిస్వామి ఉరుసు

చాగలమర్రి: మండలంలోని పెద్దవంగలి గ్రామంలో హజ్రత్ దస్తగిరిస్వామి ఉరుసు గురువారం ఘనంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. చాగలమర్రి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ముల్లా షబ్బీర్ అహ్మద్ అన్నదానికి సరుకులు విరాళంగా అందజేశారు. శుక్రవారం జియారత్ వేడుకలతో ఉరుసు ముగియనుంది.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

బొమ్మలసత్రం: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా కోరారు. గురువారం పట్టణంలోని మార్కెట్‌యార్డు నుంచి గాంధీచౌక్ వరకు ప్రభాత్ ఫార్మసీ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 200 మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించామన్నారు. మోటార్ వెహికల్ చట్టం కింద ఉల్లంఘనలపై తీసుకునే చట్టపరమైన చర్యలు, గతంలో కంటే ప్రస్తుతం పెరిగిన చలానాల గురించి అవగాహన కల్పించామని వివరించారు.

17న ఆలయాల షాపుల వేలం పాట

నంద్యాల (వ్యవసాయం): పట్టణంలోని ఆలయాల షాపుల బహిరంగ వేలం పాటలను ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు ఈఓ వేణునాథరెడ్డి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని బైటిపేట ఆంజనేయ, కోదండ రామస్వామి దేవస్థానానికి సంబంధించిన ఒక షాపు, మూలసాగరంలోని రామస్వామి దేవస్థానంలోని రెండు షాపులకు బహిరంగ వేలం పాటను నిర్వహిస్తున్నామన్నారు. బయటిపేట ఆంజనేయ, కోదండ రామస్వామి దేవస్థానం షాపు వేలంపాట ఉదయం 10 గంటలకు, మూలసాగరం దేవస్థానం రెండు షాపులకు అదేరోజు సాయంత్రం వేలం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 74165 41679కు సంప్రదించాలన్నారు.

వేడుకగా అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు

- శాస్త్రోక్తంగా తొట్టి తిరుమంజనం
- రాత్రి అశ్వవాహనంపై ఊరేగిన ప్రహ్లాదవరదుడు


విద్యుత్‌దీపాలంకరణలో దిగువ అహోబిలం దేవాలయం


కాళింగనర్తత్సవంలో ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

ఆళ్లగడ్డ: అహోబిలంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఎగువ, దిగువ అహోబిల క్షేత్రాల్లో భక్తులు పోటెత్తారు. నల్లమల పరిధిలో వెలసిన నవనరసింహ క్షేత్రాలు భక్తుల గోవిందా నామస్మరణతో పులకించిపోతున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచే కాక, పొరుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి ఇష్టదైవానికి మొక్కులులు చెల్లించుకుంటున్నారు. దిగువ అహోబిలంలో ఉదయం కాళింగనర్తనోత్సవం వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి ప్రహ్లాదవరదస్వామి అశ్వవాహనంపై అదిష్టించి మాడవీధుల్లో సంచరిస్తూ భక్తులకు కనువిందు చేశారు.




మంత్రాలయం నుంచి పాదయాత్రగా వస్తున్న భక్తులు, ఉభయ దేవేరులతో ప్రహ్లాదవరదుడు


అశ్వవాహనంపై ఊరేగుతున్న ప్రహ్లాదవరదుడు



రమణీయం..

ఉగ్రనరసింహుడి రథోత్సవం


ఉభయ దేవేరులతో రథంపై కొలువుదీరిన జ్వాలనృసింహస్వామి

ఆళ్లగడ్డ: భక్తుల గోవింద నామస్మరణలు.. పండితుల వేదమంత్రోచ్చారణలు.. డప్పుల వాయిద్యాల మధ్య జ్వాలానృసింహస్వామి రథోత్సవం ఎగువ అహోబిలంలో నేత్ర పర్వంగా సాగింది. అహోబిలేశుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పదో రోజు గురువారం ఎగువ అహోబిలంలో రథోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. భక్తులు భక్తి పారవశ్యంతో రథం లాగారు. భక్తుల గోవింద నామస్మరణతో నల్లమల ప్రాంతం మార్మోగింది. ముందుగా నిత్యపూజల్లో భాగంగా ఉత్సవమూర్తులైన జ్వాలనృసింహస్వామి, అమ్మవార్లకు వేదపండితులు పంచామృతాభిషేకం, నవకలశ తిరుమంజనం నిర్వహించారు. అనంతరం స్వామి, ఉభయదేవేరులను పట్టుపీతాంభరాలతో అలంకరించారు. మంగళవాయిద్యాల మధ్య పల్లకీలో కొలువుంచి దేవాలయం బయట ఉన్న రథం వరకు తోడ్కొని వచ్చారు. ముస్తాబు చేసిన రథంపై అహోబిలేశుడు దేవదేవేరులతో అధిష్టించారు. వేదపండితులు రథాంగ పూజలు నిర్వహించిన అనంతరం కొబ్బరికాయ సమర్పించి హారతిచ్చి రథోత్సవాన్ని ప్రారంభించారు. మాడ వీధుల్లో రథోత్సవం కనుల పండువగా జరిగింది.

శాస్త్రోక్తంగా తొట్టి తిరుమంజనం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా దిగువ అహోబిలంలో ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు తొట్టి తిరుమంజనం శాస్త్రతంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులకు తిరుమంజనం వస్త్రాలతో ముస్తాబు చేసి పూజలు చేశారు. అనంతరం వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య పన్నీరుతో నింపిన వెండి తొట్టిలో సప్త నదులను ఆవాహం చేయగా అందులో ఉత్సవమూర్తుల పాదాలను ముంచి అభిషేకించారు.


తొట్టి తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు